సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

సీఎం రేవంత్, మంత్రి సురేఖకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ

అలంపూర్, ఫిబ్రవరి 26: అలంపూర్ క్షేత్రంలో మార్చి 4వతేదీ నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు జోగుళాంబ దేవస్థానం తరఫున ఆహ్వానపత్రికను అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ముఖ్య అర్చకుడు ఆనంద్‌శర్మ, ఆలయ సిబ్బంది, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ ప్రసాదాలు అందజేశారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీని అందజేస్తున్న ఎంపీ రాములు, ఎమ్మెల్యే బండ్ల

- ఎంపీ రాములు

గద్వాల, ఫిబ్రవరి 26 : పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ రాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి మల్దకల్ మండల పరిధిలోని అమరవాయి గ్రామానికి చెందిన బేబీ మేఘనకు మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.50లక్షల ఎల్‌వోసీని చెక్కును సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సాయాన్ని పేదలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు,ఎంపీటీసీ గోపాల్ రెడ్డి నాయకులు గడ్డంకృష్ణారెడ్డి, జంబు రామన్‌గౌడ్, కృష్ణారెడ్డి, వీరేశ్‌గౌడ్, మహేశ్ పాల్గొన్నారు.

ఆర్‌వోబీని ఏర్పాటు చేయాలి

- వనపర్తి జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

మదనాపురం, ఫిబ్రవరి 26 : మండలంలోని రామన్‌పాడు రైల్వే గేట్ సమీపంలో నూతనంగా నిర్మించే అండర్‌పాస్ బ్రిడ్జికి బదులుగా ఆర్‌వోబీని ఏర్పాటు చేయాలని జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి అన్నారు. రైల్వే అధికారులు ఎర్రగట్టు సమీపంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, తాసీల్దార్ అబ్రహం లింకన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్‌పాడు ప్రాజెక్టు ఉమ్మడి పాలమూరు జిల్లాకే తాగునీరు అందించే వరప్రదాయిని అని, అలాంటి ప్రాజెక్టుతో పాటు చుట్టుపక్కల వందల ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తున్నారన్నారు. పంటలు కోసేందుకు వరి కోత మిషన్లు, ప్రాజెక్టు రిపేరుకు భారీ వాహనాలు ఈమార్గం గుండా వస్తుంటాయని, అండర్‌పాస్‌కు బదులుగా ఆర్‌వోబీని ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. అనంతరం రామన్‌పాడు, అజ్జకొల్లు, తిర్మలాయపల్లి గ్రామాల ప్రజలు రైల్వే అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, అఖిలపక్షం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చైర్మన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాసం నోటీసు

కలెక్టర్‌కు చైర్మన్,వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస నోటీస్ అందజేస్తున్న కౌన్సిలర్లు

వనపర్తి, ఫిబ్రవరి 26 : వనపర్తి మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని బీఆర్‌ఎస్ ,కాంగ్రెస్ కౌన్సిలర్లు కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. కలెక్టరేట్‌లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ పుట్టపాకుల మహేశ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ 15, కాంగ్రెస్ 8 మంది కౌన్సిలర్లు కలిసి సోమవారం కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు నోటీసు అందజేసినట్లు తెలిపారు. మున్సిపాల్ చట్టం 2019 సెక్షన్ 37ప్రకారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు మహేశ్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాకనాటి కృష్ణ, నక్కమహేశ్, బ్రహ్మచారి, నాయక్, వెంకటేశ్, పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

గట్టు, ఫిబ్రవరి 26 : మండలంలోని తుమ్మలచెర్వు యూపీఎస్‌లో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్‌గా దీక్ష, డీఈవోగా నరేశ్, హెచ్‌ఎంగా లోకేశ్వరి, ఎంఈవోగా శైలజ, పీఈటీగా నరేశ్ వ్యవహరించి అందరినీ మెప్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్‌కుమార్, ఉపాధ్యాయులు, గోవిందు, కవిత, మహేశ్వరి, అరుంధతి, గణేశ్, రమేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-All

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్షేత్రస్థాయిలో ఫిర్యాదులను పరిష్కరించాలి

- వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

ప్రజావాణిలో బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, ఫిబ్రవరి 26 : ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను అధికారులు త్వరగా పరిష్కరించేందుకు కృషిచేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి పలు రకాల ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కిందిస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో కృషి చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించిన బాధ్యులపై చర్యలుంటాయని తెలిపారు. ప్రజావాణిలో వచ్చే సమస్యలపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, అందుకు వచ్చే ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ప్రజావాణికి మొత్తం 62ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీవో వెంకటరమణ, జెడ్పీసీఈవో యాదయ్య, జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

గద్వాల, ఫిబ్రవరి 26 : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను అదనపు కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పింఛన్లు, భూసమస్యలు ఇతర సమస్యలకు సంబంధించి మొత్తం 35దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు పంపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

రిటైర్డ్ టీచర్‌కు నివాళి

నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి,ఫిబ్రవరి 26 : జిల్లా కేంద్రంలోని 30వవార్డులో రిటైర్ట్ టీచర్ ధర్మారెడ్డి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్వయంగా బాధితుల ఇంటికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ కంచెరవి, నాయకులు కోళ్ల వెంకటేశ్, ఉంగ్లం తిరుమల్ ఉన్నారు.

రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆందోళన

గట్టు, ఫిబ్రవరి 26 : స్లాట్ బుక్ చేసినా రిజిస్ట్రేషన్ చేయడంలేదని బీఆర్‌ఎస్ నాయకులు తాసీల్దార్ ఎదుట సోమవారం కొంతసేపు ఆందోళన చేశారు. గట్టు శివారులోని 681/3/1 సర్వే నెంబర్‌లోని 2.05గుంటల భూమిని ఇందిరమ్మ నాగవేణికి విక్రయించడానికి ధరణిలో స్లాట్ బుక్ చేసుకున్నది. అయితే రుణం ఉండడంతో రిజిస్ట్రేషన్ వాయిదా పడింది. తాజాగా సదరు రైతు రుణం చెల్లించి రిజిస్ట్రేషన్ కోసం సోమవారం వెళ్లింది. అయితే ఈ పొలంపై వివాదం ఉందని రిజిస్ట్రేషన్ ఆపాలని గట్టు మాజీ సర్పంచ్ తాసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి రైతులతోపాటు పార్టీ శ్రేణులతో కలిసి తాసీల్దార్‌తో ఈ విషయంపై మాట్లాడారు. దీనిపై ఎలాంటి వివాదాలు లేవని, స్లాట్ బుక్ చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ ఆపడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో కొంత వాగ్వివాదం చేటుచేసుకున్నది. అనంతరం తాసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయడంతో వివాదం అక్కడితో ముగిసింది.

ప్రభుత్వ స్థలాలు ట్రస్ట్‌ల పేరిట కబ్జా

అమరచింత, ఫిబ్రవరి 26: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టకపోవడంతో కొంత మంది వాటిని ప్రైవేట్ ట్రస్టుల పేరిట రిజిస్టర్ చేసుకొని కబ్జా చేస్తున్నారని మున్సిపల్ కౌన్సిలర్ ఊషరాణి, బీజేపీ నాయకులు రాజు, భాస్కర్ ఆరోపించారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను మున్సిపల్ అధికారులు గుర్తించి హద్దులను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్‌కు, ఆత్మకూర్ సబ్ రిజిస్టర్ అధికారికి సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది కిందట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని చాలాసార్లు వినతిపత్రాలను అందజేసినా అధికారులు పెడచెవిన పెట్టారన్నారు. దీంతో ఆర్టీసీ కొత్త బస్టాండ్‌కు ఏదురుగా ఉన్న కోట్ల విలువ చేసే రెండు ఎకరాల కందకం స్థలాన్ని కొంతమంది ప్రైవేట్ ట్రస్టు పేరిట అక్రమంగా రిజిస్టర్ చేసుకున్నారన్నారు. వీటిపై దృష్టి సారించాలని మున్సిపల్, సబ్ రిజిస్టర్ అధికారులకు వినతిపత్రం అందజేశామని తెలిపారు.

కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ పరీక్షలు

బెల్టులు అందుకున్న కరాటే విద్యార్థులు

కొత్తకోట, ఫిబ్రవరి 26 : కొత్తకోట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గాడ్స్ ఆన్ షోటోకాన్ కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టులు నిర్వహించి సర్టిఫికెట్లు, బెల్టులను అందజేసినట్లు క్లబ్ ఫౌండర్ ఎస్‌కె. నబీ తెలిపారు. 25మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హరీశ్‌యాదవ్, జాఫర్ కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

చిన్నంబావి, ఫిబ్రవరి 26: మండలంలోని కొప్పునూరులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఏపీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువ ఉన్నాయని ఉదయం 7నుంచి 12గంటల వరకు తప్పనిసరిగా ప్రతి కూలీ రావాలని, మంచినీరు అందుబాటులో ఉంచాలని, కూలీలు ఎక్కువగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టీపీలకు సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, టీపీ, ఉపాధికూలీలు ఉన్నారు.

ఫిర్యాదులపై స్పందించి న్యాయం చేయాలి

- జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 26 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ రితిరాజ్ ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు నుంచి 7ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలపై ఎస్పీ ఆరా తీసి ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులకు బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

పోలీస్ ప్రజావాణికి పది ఫిర్యాదులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 26 : జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 10ఫిర్యాదులు అందాయని అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్ తెలిపారు. జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరితగతిన చట్టపరంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. భార్యాభర్తల ఫిర్యాదులు 4, భూతగాదా ఫిర్యాదులు 6 మొత్తం 10 ఫిర్యాదులు అందాయని అదనపు ఎస్పీ చెప్పారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ

వైభవంగా అష్టాక్షరి హోమం

గద్వాలటౌన్,ఫిబ్రవరి 26 : జిల్లా కేంద్రంలోని షేరెల్లివీధిలో రాఘవేంద్రస్వామి వారి మృత్తికాబృందావనం ప్రతిష్ఠ జరిగి సోమవారంతో 15ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మంత్రాలయ పీఠాధిపతి సుభుదేంద్రతీర్థ శ్రీపాదుల వారి ఆదేశానుసారం మఠం నిర్వాహకుల ఆధ్వర్యంలో 16వ వార్షికోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. విశేష పంచామృత అభిషేకం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే స్వామివారి సన్నిధిలో రాఘవేంద్ర అష్టాక్షరి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ప్రహ్లాదరాయ ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ విచారణ కర్త ప్రభాకర్‌రావు దంపతులు, అర్చకులు వెంకటేశాచారి, నరహరి జోషి, ధనుంజయచారి పాల్గొన్నారు.

గజవాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవస్వామి

గజవాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు..

గద్వాల కోటలో వెలిసిన భూలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గజవాహనంపై రాఘవేంద్రస్వామి మఠం వరకు సాయంత్రం ఊరేగించారు. మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను తిరిగి కోటలోని చెన్నకేశవుడి ఆలయానికి తీసుకొచ్చారు. స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

విద్యుద్దీపాలంకరణలో ఆలయం

అయిజ, ఫిబ్రవరి 26: పట్టణంలో తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వ్యవస్థాపక వంశీయులు పాగుంట లక్ష్మీరెడ్డి స్వగృహం నుంచి తిక్కవీరేశ్వరుడి ఉత్సవ విగ్రహం సంప్రదాయబద్ధంగా ఎద్దులబండిపై ఊరేగుతూ ఆలయానికి చేరుకోనున్నారు. ఊరేగింపునకు ప్రత్యేకంగా ఆదివాసి కళాకారులతో గుస్సాడి నృత్యం, కల్యాణదుర్గంకు చెందిన డాల్‌బొమ్మల ప్రదర్శన, భాజాభజంత్రీలు, మేళ తాళాలు, నందికోళ సేవతో ఊరేగించేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి చట్టసేవలో భాగంగా మొండి సట్టంపై తిక్కవీరేశ్వరుడు పురవీధులగుండా విహరించనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విద్యుద్దీపాలతో ఆలయం వెలుగీనుతోంది. ఉత్సవ విగ్రహం ఊరేగింపులో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

విద్యుద్దీపాలంకరణలో తిక్కవీరేశ్వరస్వామి ఆలయం

రేపటినుంచి బ్రహ్మోత్సవాలు

అయిజ, ఫిబ్రవరి 26: పట్టణానికి సమీపంలో వెలిసిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శివరామాలయంలో బుధవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. బుధవారం సుప్రభాత సేవ, స్వస్తి పారాయణం, మూలవిరాట్లకు అభిషేకం, మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, సర్వతోభద్ర మండలి పూజ, హోమ ప్రజ్వలన, ధ్వజారోహణం, మహనైవేద్యం, మూలవిరాట్ల హోమం, అంకురార్పణ, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. గురువారం సుప్రభాత సేవ, స్వస్తిపారాయణం, ఉత్సవ మూర్తులకు అభిషేకం, 11 గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం, పూర్ణాహుతి, మహమంగళహారతి, తీర్థప్రసాద వితరణ, అన్నదానం, కలశ మహోత్సవం, సాయంత్రం 5 గంటలకు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం నుంచి కాళికాదేవి ఆలయం వరకు గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు (గ్రామోత్సవం) నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీసీరోడ్ల పనులు ప్రారంభం

రాజోళి, ఫిబ్రవరి 26: మండలంలోని ముండ్లదిన్నెలో గ్రామస్తులు సీసీరోడ్ల పనులను సోమవారం ప్రారంభించారు. ఉపాధి హామీ నిధుల నుంచి రూ.15లక్షలు మంజూరయ్యాయి. సీసీరోడ్డు పనులను సహకార సంఘం డైరెక్టర్ వెంకట్రామణ్‌గౌడ్, విద్యాకమిటీ చైర్మన్ నాగేశ్ భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పక్కిరన్న, నర్సింహులు, దేవరాజు, మహేశ్, పురుషోత్తం, విష్ణు, అంజి, రాజు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అయిజ, ఫిబ్రవరి 26: తుంగభద్ర నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపారు. సోమవారం మేడికొండకు చెందిన వీరేశ్, చిన్నతాండ్రపాడుకు చెందిన రవి ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా మేడికొండ వద్ద, చిన్నతాండ్రపాడు క్రాస్‌రోడ్డులో పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. అనుమతి లేకుండా తుంగభద్ర నది, వాగులు, వంకల్లో ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

పరికరాలకు పూజ చేస్తున్న అధికారులు, కూలీలు

‘ఉపాధి’ పనులు ప్రారంభం

అయిజ రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని సంకాపురంలో సోమవారం గ్రామీణ ఉపాధిహామీ పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉపాధి కూలీలు గొడ్డలి, పార, కొడవళ్లకు కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అశోక్, పంచాయతీ కార్యదర్శి వీరేశ్, సీనియర్ మేటి నాగరాజు, ఉపాధి కూలీలు కృష్ణ, హనుమంతు, కృష్ణయ్యగౌడ్, ముద్దన్న, నర్సింహులు, వెంకట్రాములు ఉన్నారు.

డంపింగ్‌యార్డు తరలింపుపై ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

అమరచింత, ఫిబ్రవరి 26: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట చాలా రోజుల కిందట మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు వల్ల రైతులు, బాటసారులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుందని ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వారంరోజుల కిందట మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కలెక్టర్ తేజస్‌నందన్‌లాల్ పవర్ డంపింగ్‌యార్డును సందర్శించి వెంటనే ఇక్కడి నుంచి మరో చోటకు తరలించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కాని అధికారులు ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశాలను అమలు చేయడంపై శ్రద్ధ పెట్టకపోవడంతో ఇప్పటికీ మున్సిపల్ సిబ్బంది పట్టణంలో సేకరించిన తడి, పొడి చెత్తను అక్కడే వేయడంతో పట్టణ ప్రజల ఇబ్బందులను తొలగించే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ నూరల్ నజీబ్‌ను వివరణ కోరగా డంపింగ్‌యార్డును మరో చోటుకు తరలించేందుకు స్థల సేకరణతో పాటు వాటికి సంబంధించిన డ్యాక్‌మెంట్‌ను రెవెన్యూ అధికారుల నుంచి ఇంకా అందలేదు. అలాగే స్థలం ఏర్పాటుతో పాటు అక్కడ నిల్వ చేసిన చెత్తను కాపాడుకునేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వారంలో రోజుల్లో ఇక్కడ ఉన్న డంపింగ్‌యార్డును మరో చోటకు తరలిస్తామని తెలిపారు.

డంపింగ్‌యార్డులో చెత్తను నిల్వ చేస్తున్న సిబ్బంది

వైద్యశాఖలో ఖాళీలకు
దరఖాస్తుల ఆహ్వానం

ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు అవకాశం

వనపర్తి, ఫిబ్రవరి 26 : నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేసేందుకు ఉమ్మడి జిల్లా అభ్యర్థు లు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. చైల్డ్ హెల్త్‌లో వీసీసీఎంఎస్–1, మెటర్నల్ హెల్త్‌లో స్టాఫ్ నర్సు–4, ఎన్‌సీడీలో స్టాఫ్ నర్సు–11, ఎన్‌టీఈపీలో టీబీహెచ్‌వీ–1, ఎన్‌యూహెచ్‌ఎం లో ఏఎన్‌ఎం– 5, ఫార్మాసిస్ట్–1, స్టాఫ్ నర్సు–2, జిల్లా ప్రోగ్రాం అధికారి–1 పోస్టులకు జిల్లా మెడికల్, హెల్త్ అధికారి, వనపర్తిపై డీడీ రూ.300 తీ యాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. ఈనెల 27 నుంచి మా ర్చి 2 తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు www.wanaparthy.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీటీసీలతో
ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సమావేశం

బీఆర్‌ఎస్ ఎంపీటీసీలతో ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అయిజ, ఫిబ్రవరి 26 : మండలంలోని ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సోమవారం కర్నూల్‌లోని క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అందరికీ అనుకూలమైన ఉప్పల ఎంపీటీసీ–1 ప్రహ్లాదరెడ్డిని అయిజ ఎంపీపీగా ఎన్నుకోవాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సూచించారు. అయితే, మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఉత్తనూర్ ఎంపీటీసీ ఖాళీ ఏర్పడింది. మిగిలిన 15 మందిలో 14 మంది బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు ఉండగా.. ఎన్నిక ఏకగ్రీవం కానున్నది. ఈ నెల 28న ఎంపీపీ ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల అధికారి ప్రసాదరావు ఏర్పాట్లు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 26: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి

వనపర్తి, ఫిబ్రవరి 26 : జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఏడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ తెలిపారు. జిల్లాలోని ఆత్మకూర్, ఖిల్లా ఘణపురం, రేవల్లి, వీపనగండ్ల, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్ల కార్మికులు పెండింగ్ వేతనాల కోసం సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల్లోని పారిశుధ్య సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులు మోహన్, సత్తార్, సాయికృష్ణ, మునీందర్, నాగయ్య, భీమయ్య, పార్వతమ్మ, చిన్నమ్మ, నాగమ్మ, నజమాబేగం, భాగమ్మ, సత్యవతి, లక్ష్మీదేవమ్మ, నారాయణమ్మ, అరుణ, ఇందిరమ్మ, బాలకృష్ణ, శేషమ్మ, కవిత పాల్గొన్నారు.

‘నరేంద్రమోదీని గద్దె దించాలి’

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 26 : రైతులను పొట్టన పెట్టుకున్న నరేంద్రమోదీని రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా గద్దె దించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాబర్ట్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అబ్రహం, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీహరి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఢిల్లీలో పంటలకు కనీస మద్దతు ధర చట్టం కోసం పోరాడుతున్న రైతులకు మద్దతుగా సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కళావతమ్మ, చంద్రయ్య, శ్రీరామ్, శ్యాంసుందర్, గోపాల్, రమేశ్, రవీందర్, భాస్కర్, కృష్ణయ్య, మల్లేశ్, కుతుబ్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

వైభవంగా శోభాయాత్ర

పెబ్బేరు, ఫిబ్రవరి 26 : పెబ్బేరులో సోమవారం శివస్వాములు వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. మాలధారులు శ్రీశైలానికి వెళ్తున్న సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక శివాలయంలో ఇరుముడి ధరించి దైవ దర్శనానికి తరలివెళ్లారు.

రెండు ఇండ్లల్లో చోరీ

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 26 : రెండు ఇండ్లల్లో గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట వరుసలో విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఇండ్లల్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు గద్వాల టౌన్ ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని చోరీకి సంబంధించి క్లూస్ టీంతో ఆరా తీసి కేసు నమోదు చేశారు. రెండు ఇండ్లల్లో కేజీ వెండి, 3 గ్రాముల బంగారంతోపాటు నగదు అపహరించినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధరూరు, ఫిబ్రవరి 26 : అనుమతులు లేకుండా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయకుమార్ తెలిపారు. మండలంలోని రేవులపల్లి గ్రామంలో గద్వాలకు చెందిన ఎరుకలి పెద్ద ఆంజనేయులు మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి ఆటోలో గద్వాలకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యంగా గుర్తించినట్లు తెలిపారు. ఆటోను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.